

# దేవుడు మంచివాడు

## డి. వెంకట్రామయ్య

**"అయ్యా రండి....రండి బాబు రండి.. రండి సార్ రండి .... చెప్పులిడి వెళ్లండి బాబూ....**చెప్పులు బాబూ. చెప్పు **లిడి వెళ్లండి బాబూ....**అమ్మా రండి.... **రండమ్మా రండి...."**

ఎవరూ రాలేదు, అరవలేక ఆయాస మొచ్చింది కోటిగాడికి.

తన ముందున్న చెప్పులన్నీ లెక్క బెట్టాడు. తొమ్మిది జతలున్నాయి, తొమ్మి దైదులు నలభై అయిదు.... నలభై అయిదు పైసలు! 'ఇంకా యాభై, అరవై పైసలన్నా వస్తేగాని ఈ పూటన్నా కూడు దినే ఆశుండదు....పొద్దునొచ్చిన ముప్ఫయి పైసలూ కాఫీ నీళ్ళకే సాల్లేదు. యాపారం యియ్యాల మరీ యిట్టా ఏడి

సిందేంటి?'

మళ్ళీ ఒక్కసారి బిగ్గరగా, గుళ్ళో కెళ్లే అయ్యల్నీ,అమ్మల్ని కాళ్ళకి చెప్పులూ బూట్లూ వున్నవాళ్ళందర్నీ పిలిచాడు. బ్రతిమాలాడు. ఎవరూ రాలేదు. అసలివ్వాళ గుళ్ళోకొచ్చే భక్తులే తక్కువగా వున్నారు. ఆ వచ్చిన కొద్దిమందిలో ఎక్కువమంది పక్కనున్న కాంతమ్మ దగ్గరే చెప్పులు విడిచి వెళ్తున్నారు, పూల అమ్మకంతో పాటు గుళ్లోకెళ్లేవాళ్ళ చెప్పుల రక్షణ బాధ్యత కూడా ఈ మధ్యనే స్వీకరించింది కాంతమ్మ.

'వాయసులో వుండాదిగదా, కంటికి నిండుగా' వుందగదా అని. అంతా దాని దగ్గిరికే ఎగబడతన్నారు.... దొంగనా కొడుకులు....' అని తిట్టుకున్నాడు కోటిగాడు.

కోటిగాడు కూడా ఈ 'యాపారం' మొదలెట్టింది ఈ మధ్యనే. అంతకు ముందు బస్ డిపోలో సోడాలమ్మేవాడు. అంతకు ముందు రైల్వేస్టేషన్ లోనూ వీధుల్లోనూ అడుక్కునేవాడు. వాడసలు రైల్వే స్టేషన్‌లోనే పుట్టాడు. వాడి తల్లి అక్కడే అడుక్కునేది. తన తండ్రెవడో వాడికి తెలీదు, తల్లెవరో తెలుసుకునే సమయానికి నాలుగేళ్ళ వయసులో వున్న తనని గాలికి విడిచిపెట్టి, ఆ తల్లి మరో ముష్టివాడితో మరెక్కడికో లేచిపోయింది. అప్పటి నించీ అడుక్కుతింటూనే, ఒక్కోసారి రోజులు తరబడి ఏమీ తినకుండానే పెద్ద వాడయిపోయాడు. ఇరవయ్యేళ్లొచ్చాయి. ఇరవయ్యేళ్ళింకా రాక ముందే - "పాతికేళ్లొచ్చాయి; ఎద్దులా వున్నావు? అడుక్కు తినకపోతే కష్టపడి బతకరాదూ? సోడా బుడ్లమ్ము, బుడ్డికి పైసా యిస్తాను...." అన్నాడు బస్టాండులో ఒకనా డొక ధర్మాత్ముడు. అప్పట్నించీ ఆర్నెల్లు సోడా లమ్మాడు కోటిగాడు. ఒకనాడు రోడ్డు మీద కొందరు మహా యోధులు ఒకరి మీదొకరు బాంబుల్లా విసురుకోడానికి కోటిగాడి బండిలో సోడా కాయలే దొరికాయి, నాలుగు బుడ్లు పగిలిపోయాయి. యజమాని కొట్టిన దెబ్బలతో వీపూ, తిట్టిన తిట్లతో మనసూ చితికిపోయి, ఆ 'వుద్యోగము' వదిలేసి, పెట్టుబడిలేని ఈ 'యాపారము' పెట్టాడు కోటిగాడు.

మరీ అంత చిన్నదీ, మరీ అంత పెద్దదీ కాని ఆ పట్టణంలో-చిల్లర దేవుళ్ళవీ దేవతలవీ కాక, దేవుళ్ళలో బాగా పాపులారిటీ వున్న వాళ్ళవి నాలుగు ఆలయాలున్నాయి. మొదటి మూడూ రాముడు శివుడు: ఆంజనేయ స్వాములవారి ఆలయాలు. నాలుగోది వెంకటేశ్వర స్వామిది.

కొన్ని వందల తలకాయలు మార్చేసి ఐదారు తలకాయలు తీయించేసి, పది లక్షలదాకా సంపాదించి. రెండు మిల్లులూ, నాలుగు బిల్డింగులూ, ఓ అరడజను పదవులూ, ఓ డజనుమంది అధికారుల్నీ కొనేసి, ప్రజానాయకుడిగా, దాతగా మహా భక్తుడిగా కీర్తి గడించి, ఇటీవలే కీర్తి శేషుడయిన ఒక మహానుభావుడు - చావ బోయే ముందు ఏడుకొండలవాడు కల్లో కనిపించి చెప్పిన మాట శిరసావహించిన వాడయి, ఈ వెంకటేశ్వరాలయం కట్టించి మరీ చచ్చాడు. గుళ్లో దేవుడి విగ్రహం పక్కనే, ఆ పరమ భక్తాగ్రేసరుడి విగ్రహము కూడ పెడదామనుకొన్నారు గాని, మళ్ళీ దేవుడికి కోపమొస్తుందేమోనని జడిసి, గుడి కెదురుగా నాలుగు రోడ్లూ కలిసే చోట పెట్టేశారు.

మిగతా మూడింటిలోకంటె ఈ వెంకటేశ్వరాలయంలోనే భక్తుల రద్దీ ఎక్కువ అందుకే కోటిగాడు తన 'యాపారం' యిక్కడ ప్రారంభించాడు. గుళ్లో కెళ్ళేవాళ్ళ పాదరక్షలు దాచిపెట్టి, తిరిగి వెళ్లేప్పుడు ఎవరివి వాళ్ళకి యిచ్చి, మనిషికి అయిదు పైసలు చొప్పున తీసుకుంటాడు. మొదట్లో రోజుకి కనీసం మూడు నాలుగు రూపాయలు కళ్ళ జూసేవాడు. అది చూసి కన్నుకుట్టిన మరో యిద్దరు కూడా పోటీకి దిగారు. అయినా కోటిగాడి దగ్గరకే ఎక్కువమందొచ్చేవారుగాని, పువ్వులమ్మే కాంతమ్మ పువ్వులమ్మకంతోపాటు ఈ వృత్తి కూడా స్వీకరించాక ఎక్కువ మంది ముఖ్యంగా మగాళ్ళు దాని దగ్గరకే వెళ్ళడం ప్రారంభించారు.


పువ్వులమ్మే కాంతమ్మ పువ్వులతో పాటు, పూలచెండు లాంటి తన శరీరాన్ని కూడా అమ్ముతూ వుంటుంది. అందుచేత పూలకోసమో, పూలచెండుకోసమో దాని దగ్గర కెళ్ళేవాళ్ళంతా, గుళ్ళోకెళ్లే ముందు అయిదు పైసలడిగితే పది పైసలిచ్చి చెప్పులు కూడా దాని దగ్గరే విడిచి పోతారు.

'అయ్యా రండి బాబూ రండి....రండి సార్ రండి....ఇటు సార్ యిటు.... చెప్పులిడిపి పొండి బాబూ....అమ్మా.... అమ్మగారూ....రండమ్మా రండి....'

మళ్ళీ అరవడం మొదలెట్టాడు కోటిగాడు,

ఎవరూ రాలేదు. ఆకలి కరకరలాడుతోంది. పొద్దున్ననగా కాకా హోటల్లో తాగిన కాఫీనీళ్ళు తప్పితే పొట్టలో ఏమీ పడలేదు,

కాలేజీ కుర్రాళ్ళు కొందరుగంట నుంచీ గుడి ముందు నిలబడి. వచ్చేపోయే ఆడపిల్లలకి పోజులు కొడుతున్నారు. "లోపల కన్నా యెల్లరే యెదవనాయాళ్ళు....ఎత్తే చెప్పులన్నా యిడిసెల్తారేమో....ఇయ్యాల పెద్ద వత్తిడి లేదుగా....జనం కిట కిటలాడుతూ వుంటే యీ పాటికి లోపలకి లగెత్తేవారు. అప్పుడయితే ఆ వొత్తిడిలో తోపుళ్ళు....తొక్కిళ్ళు....నొక్కిళ్ళు.... ఏమయినా చెయ్యొచ్చు. అళ్ళు వొచ్చేదందుకేగా అసలు....దేముడి కోసమేంటి ఆళ్లొచ్చేది....ఆళ్ళన్నా మాకేంటి....సదువుకునే ఆడపిల్లలు, వయసొచ్చినోళ్ళు, వయసు ముదిరినోళ్లు, పెద్ద పెద్ద కారుల్లో




తిరిగే అమ్మలు. తల్లులు, ఎంత మంది యిందుకోసం, ఈ తోపు కోసం, తొక్కిళ్ళ కోసం, నొక్కుళ్ల కోసం, మూళ్ళ కోసం రాటల్లేదు .. అమ్మా.... రండమ్మా....రండి తల్లీ రండి....

ఖరీదయిన చీరె; చేతుల్లేని బ్లౌజ్; పెద్ద షోకయిన ముడి; చేతిలో వెనిటీ బాగ్‌తో ఒకావిడ కోటిగాడి దగ్గర కొచ్చింది. చీరె కొద్దిగా పైకెత్తి షూ విప్పబోయింది. కోటిగాడు వెంటనే—

"నే విప్పుతానండమ్మగారూ.... నే విప్పుతా" నంటూ తనే అందమైన షూస్ విప్పాడు...."ఏదమ్మా, సీర మరికొంచెం పైకెత్తు....మాతల్లే కాళ్ళనిండా ఈమచ్చ లేంటి పైన బొటారం. లోన లొటార మేనా....అందుకేనా తల్లీ చీర అంత కిందకి పాదాలు మునిగిపోయేట్టు కట్టావ్"

బాగ్ వూపుకుంటూ, ఎర్రంగా వున్న కాలేజీ కుర్రాళ్ళ వేపు దొంగ చూపులు చూస్తూ, గుడిలోకెళ్ళి పోయింది ఆ భక్తురాలు

ఆ తరవాత చాలామంది భక్తులొచ్చారు.

ఆ వూళ్లో ప్రసిద్ధ వర్తకులు వెంకయ్య శెట్టిగారు కార్లో వేంచేశారు. బజార్లో ఎక్కడా దొరకని వస్తువులన్నీ నల్ల బజారులో అమ్మి ప్రజాసేవ చెయ్యడంలో వారు పేరు పొందారు, కట్టిన రెండేళ్ళకే కూలిపోయిన కాలేజీ బిల్డింగు కట్టిన కంట్రాక్టర్ కామరాజుగారు ఆ తరువాత విచ్చేశారు. ఆయనకా కంట్రాక్టు యిప్పించి, కాలేజీతోపాటు తనూ ఓ బిల్డింగు కట్టించుకున్న కాలేజీ కమిటీ చైర్మనూ, మునిసిపల్ చైర్మనూ కూడా అయినటువంటి రామనాధంగారు తనకొచ్చిన దాన్ని కూడ వెంటబెట్టుకుని భగవద్దర్శనార్థం ఏతెంచారు. మునిసిపల్ చైర్మన్‌గా పోటీ చేసి వోడిపోయి, ఈసారి ఏకంగా పార్లమెంటుకే పోటీ చెయ్యాలన్న సదుద్దేశ్యంతో-ఇప్పటికారు పార్టీలు మార్చిన మహానాయకులు రామిరెడ్డిగారు కూడ మరి కాస్సేపటికి వచ్చారు.

ఈ రకంగా యిలాంటి భక్తాగ్రేసరులు చాలమంది వచ్చినప్పటికీ, కోటిగాడి దగ్గర కెవరూ రాలేదు. కడుపు మండుతోంది. ఆకలితోనూ కోపంతోనూ కూడా. "ఈళ్లు అంతా బక్తులా....ఈళ్ళయితే గుడిసీ గుళ్లో లింగాన్నీ కూడా మింగేసే దొంగనా కొడుకులు...." అనుకున్నాడు.

మరికాస్సేపు అరవగా అరవగా ఒకడొచ్చాడు. సూటూ బూటూ వేసుకుని డాబుగా వున్నాడు, కోటిగాడు బూట్లు విప్పాడు, లోపల మేజోళ్ళున్నాయి. అవి కూడా తనే విప్పాడు. ( అబ్బ కంపు.... మేజోళ్ళుతికి ఎన్నాళ్ళయింది బాబూ.... యిదేనా బాబూ నీ డాబు....నీకంటే నేనే సుబ్రంగా వుంటానే....') సూట్‌వాలా గుళ్లోకెళ్ళిపోయాడు.

లోపల్నుంచి ఒక పూజారి గబ గబా వచ్చి, చాటుగా తెచ్చిన కొబ్బరికాయలు - కాయలూ పళ్లూ అమ్మే దుకాణంలో పడవేసి, ఏమీ ఎరగనట్టు మళ్లీ లోపలికి పోయాడు.

గుళ్లోకొచ్చేది వాళ్ళలో ఒకటి కంటే ఎక్కువ కొబ్బరికాయలు తెచ్చిన వాళ్ళ దగ్గర తీసుకు దాచినవన్నీ యిలా దొంగ చాటుగా అమ్మి, పూజార్లు ముగ్గురూ పంచుకుంటారు.

'ఓరి బగవంతుడా! ఎంత మాయ? ఎంత మోసం....' అనుకుని నిట్టూర్చాడు కోటిగాడు.

ఆ తరువాత ఒక పెద్దమనిషి వచ్చాడు. అతనా వూళ్లో ఒక చిన్న హోటలూ, పెద్ద వేశ్యాగృహమూ నడుపుతూంటాడు, కోటిగాడా పెద్దమనిషిని చూడగానే 'ముండల కంపెనీ వోడొచ్చాడు' అనుకుని 'రండి బాబూ రండి...." అని ఆహ్వానించాడు.

కోటిగాడు ఐదు పైసలడిగితే, మూడు పైసలే యిస్తానని బేరం చేసి, వొప్పుకోనందుకు తిట్టుకుని "సరే తీసుకో, కొత్త చెప్పులు....నిన్నే కొన్నాను జాగ్రత్త" అని హెచ్చరించిపోయాడు ముండల కంపెనీ భక్తుడు.

కోటిగాడు కూడా ముండల కంపెనీ వాణ్ని మనసులో తిట్టుకున్నాడు, ఆపైన పావుగంట.... ఆరగంట.... గంటయినా ఎవరూ రాలేదు. విడిచి వెళ్ళిన వాళ్ళంతా

చెప్పులు తీసుకెళ్ళిపోయారు, ముండల కంపెనీవాడు తప్ప:

పైసలు లెక్కపెట్టుకున్నాడు కోటిగాడు. యాభై అయిదు పైసలున్నాయి, ఆకలి మండుతోంది. నీరసంగా వుంది, 'ఈ వొక్క జతా కూడ యిచ్చేసి ఇయ్యాల్టికిక యాపారం ఎత్తేత్తేనే మంచిది. ఎవడూ రాండే.... ఈడేడీ.... లోపల్నించి యింకా రాడే....ముండల యాపారము జేసేటోడు అడికీ యింత బక్తా.... ఎం జేత్తన్నాడో యింకా లోపల....'

కూర్చున్న చోటునుంచి లేచి, కాస్సేపు అటూ యిటూ తచ్చాడి, గుడి గుమ్మం ముందుకెళ్లి, లోపలికి తొంగి చూశాడు.ఆపెద్దమనిషి ఎక్కడా కనబళ్లేదు, 'ఈడెక్కడ జచ్చాడో' అనుకుంటూ వెనక్కి తిరిగిచూశాడు. ముండల కంపెనీ వాడిచెప్పుల్లో ఒకదాన్ని, ఎక్కడిదో బక్కచచ్చిన కుక్క వొకటి రుచి చూస్తోంది. వెంటనే కుక్క మీదకి రాయి విసిరి, అదిలించాడు కోటిగాడు. కుక్క చెప్పు నోట్లో కరుచుకుని పరుగు లంకించుకుంది. కోటిగాడు అరుస్తూ, బూతులు తిడుతూ మధ్య మధ్యలో వొంగి రాళ్ళు ఏరి విసురుతూ కుక్క వెంటపడ్డాడు. కుక్క బక్కదైనా బాగా వేగంగా పరుగెత్తుతోంది కోటిగాడు దానితోపాటు పరుగెత్తలేక పోతున్నాడు. కుక్క వాడికంటే యిరవై ముప్ఫయ్ గజాలు ముందుంది. ఆ బజారు మలుపు తిరిగింది....సాంతం తిరగలేదు. తిరగబోయి, ఎదురుగా వస్తున్న లారీని చూసి జడుసుకుని, తప్పుకోబోయి వెనకనుంచి వస్తున్న బస్సు కింద పడిపోయింది. బస్సూ ఆగలేదు. లారీ ఆగలేదు, దారే పోయేవాళ్లూ ఆగలేదు, ఎవరి దారిన వాళ్ళ వెళ్ళిపోయారు. కోటిగాడు మాత్రం ఆగాడు. కుక్క చచ్చిపోయింది. ఎముకలు విరిగి పైకి వెళ్ళుకొచ్చాయి. తల పచ్చడయింది, చెప్పు కూడా యింకా పళ్ళ మధ్యనే వుంది,

చచ్చిన కుక్క బ్రతికొచ్చి, తిన గుండె కాయపళ్ళతో పట్టి పీకుతున్నట్టుగా వుంది కోటిగాడికి. కాస్సేపు అలాగే చూస్తూ నిలబడ్డాడు. ఇంకా చూడలేక గబగబా వెళ్ళి చచ్చిన కుక్క నోట్లోంచి చెప్పు బలవంతాన లాగి 'పిచ్చిముండని సేతులారా సంపానే....దాని కెన్నాళ్ళ నుంచి కూడు లేదో....శెప్పుమీదాశ పడింది....' అనుకుంటూ గుడి దగ్గర కెళ్ళి, తన స్థానంలో కూర్చున్నాడు,



చెప్పు పట్టీ వొకటి పూర్తిగా పాడైపోయింది, తెగిపోయింది చాలా చోట్ల కుక్క రక్తపు మరకలు.... తను నేలమీదేసుకున్న చివ్వ గుడ్డ తీసి ఆ మరకలు తుడిచేశాడు.

'శెప్పు పాడయిపోయింది.... ఇప్పుడీ ముండల కంపెనీ వోడేం గొడవ జేత్తాడో' అనుకుంటూ వుండగానే వాడొచ్చాడు.

"బాబుగారూ.... మన్నించాలి బాబుగారూ.... శెప్పు కుక్కముండీడుసుకుపోయింది....పట్టీ తెగిపోయింది....శెమించండి బాబూ...."

"బంగారం వంటి శెప్పు పాడుచేసి. యింకా క్షమించమంటావేరా రాస్కెల్! నీకు డబ్బులిచ్చేది చెప్పులు కుక్కలకప్పజెప్పటానికిరా.... యిరవై రూపాయల కోడది....డబ్బు కట్టరా...."

"తమరట్టా అంటే నేనేం శెయ్యగలను బాబూ....పొరపాటయి పోయింది శెమించమంటన్నాగందా....అంత డబ్బు నేనెక్కడ్నించి తేగలను బాబూ నా దగ్గర ఇదిగో ఈ యాభై అయిదు పైసలూ వుండయ్. యియ్ తీసుకుని శెప్పు బాగు చేయించుకోండి దొరా...."

కోటిగాడి చెంప ఛెళ్లుమంది, ముందుకి చాచిన చేతులోంచి, పైసలెగిరి, నేలమీద చెల్లాచెదురుగా దుమ్ములో పడ్డాయి.

"నోటి కొచ్చినట్టల్లా కూస్తావురా దొంగ లంజ కొడకా!....నేనేం ముష్టివాడి ననుకున్నావురా!.... చెప్పంతా చెడగొట్టి. బాగుచేయించుకోమని అర్ధ రూపాయి యిస్తావ్?....ఎంత పొగర్రా నీకు...." అని యింకా నాలుగు బూతులు తిట్టి, చెప్పులు అట్లాగే తొడుక్కుని కాలీడ్చుకుంటూ పోయాడు ముండల కంపెనీవాడు.

కోటిగాడికి కోపమొచ్చింది; ఏడుపొచ్చింది. కళ్ళంట నీళ్లు తిరిగాయి. ఆకలి పేగులు తినేస్తోంది. దెబ్బ బాగా తగిలింది. దవడ నొప్పిగా వుంది. నీరసం....ఆయాసం....కళ్ళు తిరుగుతున్నట్టుగా వుంది,

చీకటి పడుతోంది. గుళ్లోకొచ్చే భక్తుల సంఖ్య క్రమ క్రమంగా తగ్గిపోతోంది. దుమ్ములో పైసల కోసం వెతికాడు కోటిగాడు, ముప్పై పైసలే దొరికాయ్. ఇంకో పావలా బిళ్ళ కనపడలేదు. యింక వెతకలేక మెల్లగా లేచివెళ్ళి. గుడి గుమ్మంపక్కనున్న అరుగు మీద కూలబడ్డాడు, కాళ్ళు లాగుతున్నాయి, కళ్ళు మూసుకుని పడుకున్నాడు.... పుట్టింది మొదలూ పడ్డ బాధలూ....చూసిన లోకం....మోసాలూ. పాపాలూ....కుట్రలూ....చచ్చిన కుక్క. ముండల కంపెనీవాడి తిట్లు....దెబ్బ....ఈ దృశ్యాలన్నీ, ఆలోచనలన్నీ కళ్ళ ముందు కదిలాయి, మనసు చుట్టూ మూగాయి. 'ఈ పెపంచకంలో నాయంగా, ధర్మంగా నడిశేవోడు బతకలేదు. అట్టాంటోళ్ళకి దేముడూ సాయం శెయ్యడు....' అనుకున్నాడు.

* * *

రాత్రి పదిగంటలయింది. బజారంతా దాదాపు నిర్మానుష్యంగా వుంది, గుడి చుట్టు పక్కలున్న దుకాణాలన్నీ మూసేశారు, గుడి సింహద్వారం తలుపులు వోరగా వేసి వున్నాయి. ఒక పూజారి రాత్రంతా గుళ్లోనే వుంటాడు.

అరుగు మీద మగత నిద్రపో యిన కోటిగాడు లేచి కూర్చున్నాడు. 'కాఫీ నీళ్లు తాగితే బాగుణ్ణు' అనుకున్నాడు. కాఫీ తాగాలంటే కనీసం రెండు ఫర్లాంగుల దూరం వెళ్ళాలి. నడిచే ఓపిక లేదు. లోపలి కెళితే పూజారి పెసాదమేమయినా పెడతాడేమో' అనుకుని లేచి. మెల్లగా గుడి ఆవరణలోకి ప్రవేశించాడు.

గుళ్లో అంతా చీకటి. లోఫర్లు, డాఫర్లూ, ఖాపీకోర్లూ, మనిషి వేషం లేసుకున్న తోడేళ్లూ, గుంటనక్కలూ, నాగుపాములూ అక్కడ కడిగేసుకు పోయిన పాపాలన్నీ గడ్డకట్టినట్టుగా వుంది ఆ చీకటి. ఆ చీకటికి జడిసిపోయి, గర్భగుడిలో దేవుడి ముందు ఉన్న చిన్న దీపం తల వంచుకుని భయం భయంగా వెలుగుతోంది. ఆ వెలుగులో వెంకటేశ్వరుడి నల్లరాతి విగ్రహం మరీ నల్లగా కనిపిస్తోంది.

గర్భగుడిలో ఎవరూ లేరు దేవుడు తప్ప.

కోటిగాడు పూజారి కోసం వెతికాడు. గర్భగుడి పక్కనుంచి, దేవాలయం వెనక ఖాళీగా వున్న దొడ్లోకి దారి వుంది. అటు వెళ్ళి చూశాడు. ఆ దొడ్లో గన్నేరు చెట్టు కింద పూజారి పువ్వులమ్మే కాంతమ్మని గట్టిగా కావిలించుకుని ముద్దెట్టుకుంటున్నాడు.

కోటిగాడు వెనక్కి వచ్చేశాడు. మెల్లగా గర్భగుడిలోకి వెళ్ళాడు. దేవుడి కోసం పెట్టిన, చక్కెర పొంగలి; పులిహోర; లడ్డూలు; కొబ్బరి ముక్కలూ దేవుడు తినలేదు. కోటిగాడు ఆత్రంగా చేతికి దొరికినంత. పొట్ట పట్టినంత తినేశాడు. ఆకలి తీరింది. లేచి నిలబడ్డాడు. దేవుడికేసి చూశాడు, మరి కాస్సేపటికి ఆరిపోవటానికి సిద్ధంగా వున్న గుడ్డి దీపపు వెలుతురులో దేవుడి మెడలోనూ, దేవేరి మెడలోనూ వున్న నగలు మెరుస్తున్నాయి. ఆ నగలన్నీ వొలిచి మూటగట్టాడు.

చేతులు జోడించి 'నన్ను క్షమించు సామీ' అని చెంపలేసుకుని, నగల మూట బొడ్లో దోపుకుని, గబగబ గుళ్లోంచి బయటికి వెళ్ళిపోయాడు.

దేవుడు మంచివాడు, పాపం ఏమీ అన్లేదు. చూస్తూ వూరుకున్నాడు. *




# నెర్వొటాల్ [NERVITOL]

ఇది సమస్త వ్యాధులకు పనిచేయునట్టి రసాయన యోగము. నిర్భయముగా వాడవచ్చును. కస్తూరి, మొమ్మాయి మొదలగు ద్రవ్యములతో కూర్చబడి తయారుకాబడిన వాజీకరణ ఔషధము. చక్కని ఆరోగ్యమిచ్చి, పుష్టిని, కాంతిని, మనోల్లాసమును కలిగించును మేహములను పోగొట్టును. ధాతునష్టము, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, మిక్కిలి బలహీనత వలన చెవిలో ధ్వని, తల తిరుగుట, కాళ్ళు తిమ్మెరలు, తలనాదు, సరిగా నిద్రపట్టకపోవుట, కండ్లు కాళ్ళు చేతుల మంటలు నరముల బలహీనత వలన సంభవించు అనేక వ్యాధులమీద అద్భుతముగా పనిచేయును. జ్ఞాపక శక్తిని వృద్ధి నొందించును. జనరల్ అండ్ నెర్వ్‌టానిక్.

**450 మిలి రు. 12-50, 220 మిలి 6-75, 110 మిలి 3-50**

# ఇండియన్ మెడిసిన్ హౌస్

**(శాస్త్రీయ ఆయుర్వేదౌషధములు ఇంజక్షనులు తయారుచేయు సంస్థ)**

**విజయవాడ - 2**

**సమస్త ఆయుర్వేదౌషధములు ఇంజక్షనులు దొరుకును - వైద్యులకు కేట్లాగు ఉచితము.**